క్లుప్తంగా

వారపు సంత వేలం



వారపు సంత వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించనున్న వారపు సంత వేలం సచివాలయంలో శుక్రవారం వేసినట్లు ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప తెలిపారు. దాదాపు 15 మంది వేలంపాటలో పాల్గొన్నారన్నారు. అత్యధికంగా పాటపాడిన బి. మారెన్న అనే వ్యక్తి రూ. 1.11 లక్షలకు వారపు సంత దక్కించుకున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని ఇనగలూరు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

ఎంఎస్‌యూఏ నాయకుల సంబరాలు



స్వీట్లు పంచుకుంటున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

మడకశిర: ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో జరిపిన పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ముందుకు రావడం హర్షణీయమని ఎన్ఎంయూఏ నాయకులు తెలిపారు. శుక్రవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మడకశిర డిపోలో ఆర్టీసీ కార్మికులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేయడం వల్ల ప్రభుత్వం దిగి వచ్చి ఉద్యోగ భద్రత కల్పించే సర్క్యులర్‌ను అమలు చేయడానికి నిర్ణయించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో కాలు విరిగిన చాకల కిష్టప్ప



తీవ్రంగా గాయపడిన బుజ్జప్ప

రొద్దం: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలు.. రొద్దం గ్రామానికి చెందిన చాకలి కిష్టప్ప, గౌస్ కాలినడక వెళ్తుండగా ధర్మవరానికి చెందిన బుజ్జప్ప ద్విచక్రవాహనంపై పెనుకొండ వైపు నుంచి వెళ్తూ ఢీకొన్నాడు. ఈప్రమాదంలో చాకలి కిష్టప్పకు కాలు విరిగింది. ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి హామీ బిల్లులు మంజూరు చేయాలి

సోమందేపల్లి: ఉపాధి హామీ కూలీలకు బకాయి పడిన వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న కోరారు. శుక్రవారం గుడిపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 26న గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇతర ప్రాంతాల వారికి అనుమతి ఇవ్వొద్దు'



కార్యదర్శి సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

అమరాపురం: మండల కేంద్రంలో శ్రీ షిరిడీ సాయి నాయీ బ్రాహ్మణ సహకారం సంఘం అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి సెలూన్ షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని నాయీ బ్రాహ్మణులు కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ వాగేష్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరాపురంలో దాదాపు 30 కుటుంబాల వారు క్షవర వృత్తినే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఇతర ప్రాంతాల వారు వచ్చి అమరాపురంలో షాపులు పెట్టుకుంటే తమకు అన్యాయం జరుగుతుందన్నారు. తమ సంఘం అనుమతి లేనిదే షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దని కోరారు. కార్యదర్శి మాట్లాడుతూ.. ఇతరులు గ్రామంలో షాపులు ఏర్పాటు చేసే సమయంలో గ్రామ పంచాయతీ వారి దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఇతర ప్రాంతాల వారికి అనుమతి ఇవ్వబోమని హామీ ఇచ్చారు. గణేష్, తిప్పేస్వామి, నరసింహ మూర్తి, ప్రభాకర్, కార్తీక్, అశోక్, మారుతి, ముత్తు, నరేష్ పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సర్కిల్ వద్ద రోడ్డుపై తిష్టవేసిన పశువులు



లేపాక్షి రోడ్డులోని డీబీకాలనీ సమీపంలో రోడ్డుపై పడుకున్న పశువులు

పురం.. పశువుల పరం!

- రహదారులే పశువులకు ఆవాసాలు
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు

హిందూపురం: పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ పశువుల పరమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మెయిన్‌బజార్ వరకు, ఇటూ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రహమత్‌పురం సర్కిల్ వరకు ఉన్న రోడ్లపై పశువులు నిత్యం సంచరిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు పాలు పిండుకుని వదిలేస్తున్నారు. వాటికి తోడు చిన్న దూడలను సైతం రహదారులపైకి వదులుతుండటంతో రోడ్లపై తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సమస్యను పరిష్కరించాల్సిన చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిత్యం రోడ్లపైనే..

పశువులను రోడ్లపైనే వదిలి వేయడంతో అవి రోడ్లపై అడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్ అంతరాయం కల్గిస్తున్నాయి. ఆకస్మాత్తుగా రోడ్లపైకి వస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు పశువులకు సరైన మేత లేక సమీపంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. దీంతో అవి తీవ్ర అనారోగ్యాల పాలై మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి పశుసంచారాన్ని అరికట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గోశాలకు తరలిస్తాం



రహదారిపై సంచరిస్తున్న పశువులకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. వాటి యజమానులకు నోటీసులు ఇస్తున్నాం. ఆసమయంలో పశువులను రోడ్లపై వదలమని చెబుతున్నారు. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా రోడ్లపై వదిలేస్తున్నారు. వారు స్పందించికపోతే వాటిని గోశాలకు తరలిస్తాం.

–శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

యజమానులదే బాధ్యత



పశుయజమానులు పశువులను రోడ్లపై వదిలేసి నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అవి రోడ్లపై అడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్నాయి. ఏవైనా ప్రమాదాలు జరిగితే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. పశువుల యజమానులు వాటిని కట్టడి చేయాలి. అప్పటికీ స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–మహేష్, డీఎస్పీ, హిందూపురం

చదువుకు పేదరికం అడ్డుకాదు



దీక్షిత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన దీక్షిత్ అకుంఠిత దీక్షతో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుని మొదటి సారే ఐఎఫ్ఎస్‌కు ఎంపిక కావడం గర్వకారణం. ఇలాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని చదువుకు పేదరికం అడ్డు కాదనే నిజాన్ని గుర్తించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ సూచించారు. అమరాపురం గ్రామానికి చెందిన కుంచిటి వక్కలిగ కులస్తుడు ఈశ్వరప్ప కుమారుడు దీక్షిత్ అఖిల భారత ఫారెస్ట్ సర్వీసుకు ఎంపిక కావడంతో శుక్రవారం వారి స్వగృహంలో కలసి అభినందించారు. అనంతరం శాలువా పూలమాలలతో దీక్షిత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీరక్యాతరాయ, ఎంపీటీసీ నారాయణ, మడకశిర నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, బీసీ సెల్ అధ్యక్షుడు శివకుమార్, తమ్మడేపల్లి సర్పంచ్ సదానందగౌడ, ఉప సర్పంచ్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మడకశిరరూరల్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శంకరమ్మ

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. కిశోరి బాలికలకు ఉన్నత విద్య నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం, బాల్యవివాహాలు, పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ.. బాలికలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చిన్న వయస్సులోనే బాలికలకు వివాహాల చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి అంగన్‌వాడీ కేంద్రం–2లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి బాలిక ఉన్నత విద్య, ఓపెన్ స్కూలింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. బాలికలు విద్యపై అవగాహన పెంచుకుని ఉన్నత చదువులు చదువుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. విద్య ప్రాధాన్యతను బాలికలు, మహిళలకు వివరించారు. వేసవి సెలవుల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఏజెన్సీ ఖాతాల్లోకి రైతుల సొమ్ము



ఉద్యాన శాఖ కార్యాలయం

పావగడ: తాలూకా వ్యాప్తంగా బిందు సేద్యం నిర్వహణలో భాగంగా 2024–25 ఏడాదికి సంబంధించి 727 మంది రైతుల ఖాతాల్లోకి జమ చేయాల్సిన రూ 5.29 కోట్ల ప్రోత్సాహక ధనం నేరుగా ఏజెన్సీలకు జమ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పావగడ ప్రాంతంలో తీవ్ర వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావుల కింద అరకొర నీటితో బిందు సేద్యం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహక ధనం అందించేందుకు చర్యలు తీసుకుంది. బిందు సేద్యం చేసేందుకు ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ తదితర బీసీ సామాజిక వర్గాల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎకరాకు రూ.32 వేల చొప్పున మొత్తం 727 మంది రైతులకు రూ 5.29 కోట్ల ప్రోత్సాహక ధనం మంజూరైంది. అయితే రైతు ఎకరాకు రూ.1,500 డిపాజిట్ ప్రభుత్వానికి చెల్లిస్తే మిగిలిన ధనం రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుంది. అయితే ఉద్యాన శాఖ ఆ ప్రోత్సాహక ధనాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేయకుండా ఏజెన్సీలకు అక్రమంగా బదిలీ చేసినట్లు సమాచారం. రైతులు రూ.1,500 డిపాజిట్ చెల్లించక పోవండంతో ప్రభుత్వం అందించిన ప్రోత్సాహక ధనం నేరుగా ఏజెన్సీలకు బదిలీ అయినట్లు స్థానిక ఉద్యాన శాఖ ఏడీ విశ్వనాథ గౌడ చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఐఎస్ఐ బ్రాండ్ నాణ్యమైన డ్రిప్ పైపులు అందించకుండా రైతులతో కొనుగోలు చేసిన పాత పైపులనే రీసైక్లింగ్ చేసి రైతులకు అందిస్తున్నారని స్థానిక రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప ఆరోపించారు. ఈ వ్యవహారంపై తనిఖీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న గ్రామోత్సవం





అలంకరణలో లక్ష్మీ నిడిమామిడమ్మ , ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లి గ్రామంలో వెలిసిన లక్ష్మీ నిడిమామిడమ్మ దేవి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. టీప్పురు నుంచి తీసుకొచ్చిన దూతరాయుడు, ముత్తురాయుడు ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పార్టీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని జెడ్పీటీసీ సభ్యులు అశోక్ నివాసంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిందని అన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి, గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సుపరి పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు గజేంద్ర శ్రీనివాసులు, సర్పంచులు అంజినాయక్, నరసింహమూర్తి, నాయకులు ఆదినారాయణ రెడ్డి, మంజు, గోవింద రెడ్డి, హనుమంతు, సాయిరాం రమేష్, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి న్యాయం చేస్తాం



ఈరలక్కప్పను సన్మానిస్తున్న నాయకులు

గుడిబండ: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి. కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఫళారం గ్రామంలో సమన్వయకర్త ఈరలక్కప్పను మడకశిర మండలం కదిరేపల్లి పంచాయతీ పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిశారు. శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఐదు మండలాల్లో వివిధ పదవులను నాయకులకు కట్టబెట్టారన్నారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనకు తొందరలోనే ప్రజలు చరమగీతం పాడతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి చెందిన ఓ కార్యకర్త కూటమి నాయకులు న్యాయం చేయడం లేదని పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసినా ప్రభుత్వానికి సిగ్గు రాలేదన్నారు. ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. జెడ్పీ హాలులో చైర్మన్ గదిలోకి చొరబడి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటాన్ని ఎందుకు ఉంచారని ఎమ్మెల్యేలు హల్‌చల్ చేయడం దుర్మార్గమన్నారు. కదిరేపల్లి సర్పంచ్ నరసేగౌడు, మడకశిర మండల ఉపాధ్యక్షుడు నరసింహ మూర్తి, ఎంపీటీసీ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కెంచప్ప, వైస్ సర్పంచ్ రంగయ్య గౌడ్, అశ్వత్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రాస్ రూట్ ఫుట్‌బాల్ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

హిందూపురం టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఆర్డీటీ గ్రాస్ రూట్ ఫుట్‌బాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆటలో మెలకువలను నేర్చుకుని, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. హిందూపురం టౌన్, సౌత్, యునైటెడ్ క్లబ్ నుంచి క్రీడాకారులు, కోచ్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ సలీమ్, ట్రెజరర్ శేఖర్, పీడీలు లోక్‌నాథ్, విజయభాస్కర్, ఈసీ మెంబర్ విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మం, గోవిందమ్మ కల్యాణం



పూజలందుకున్న వీరబ్రహ్మం, గోవిందమ్మ మూలవిరాట్లు

బత్తలపల్లి: తంబాపురం గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మంగారి దేవస్థానంలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మం, గోవిందమ్మ కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో బ్రహ్మంగారి మూలవిరాట్‌లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సానే బ్రహ్మానందరెడ్డి, సానే స్వప్న దంపతులు, గ్రామ సర్పంచు సానే జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పోతులూరి వీరబ్రహ్మం, గోవిందమ్మ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 వరకు అన్నదానం నిర్వహించారు. రాత్రికి ఆలయంలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భజన బృందాలచే తెల్లవార్లు భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఆటో మల్లేసు, బీదాల మారుతిరెడ్డి, తాడిమర్రి సంజీవరెడ్డి, నాగప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే ఎలా?

అమరాపురం: నియోజకవర్గంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శివన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. చాలీచాలని జీతంతో గ్రామాల్లోని ప్రజలకు శ్రీరామిరెడ్డి తాగునీటిని కార్మికులు సరాఫరా చేస్తున్నారని తెలిపారు. ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వం జీతాలు విడుదల చేయక పోవడంతో వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్మికుల సమ్మెతో తాగునీటి కోసం ఇబ్బందులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కనీసం వారి సమస్యలు విని ప్రజలకు తాగునీటిని అందించకపోవడం సరి కాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల జీతాలు చెల్లించి వారిని ఆదుకోవాలన్నారు. లేదంటే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణ, సదానంద గౌడ, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న దృశ్యం

మడకశిర: పాకిస్తాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో శుక్రవారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల గుండా సాగింది. యువకులు ద్విచక్ర వాహనాల్లో జాతీయ జెండాలను ఏర్పాటు చేసుకుని ర్యాలీలో పాల్గొన్నారు. వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మాజీ సైనికులను పట్టణ ప్రముఖులు సన్మానించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రొళ్లలో యోగా సాధన చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రొళ్ల: ప్రతి ఒక్కరు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వరరావు శాస్త్రి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, ప్రజా ప్రతినిధులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం వేళల్లో యోగా సాధన చేయడానికి సమాయత్తం కావాలని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే యోగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అందుబాటులో ఉంచాలి



సబ్ రిజిస్ట్రార్లతో సమస్యపై మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ యూనియన్ నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అందుబాటులో ఉంచాలని రియల్ ఎస్టేట్ యూనియన్ సభ్యులు కోరారు. శుక్రవారం వారు సబ్ రిజిస్ట్రార్లు శ్రీనివాసులు, భాగ్యశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్లు మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి పెట్టిన ఇండెంట్ రాలేదని, ఇదివరలో వచ్చిన వాటిని వినియోగదారులు ఎక్కువగా తీసుకొని స్టాక్ పెట్టుకోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్ యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల స్టాంపుల అమ్మకాలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడంతో వారు వినియోగదారులపై ఒకటికి రెండింతలు భారం మోపుతున్నారన్నారు. స్టాంపులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే విక్రయించాలని కోరారు. మరోవైపు వందల ఏళ్ల భద్రపరచాల్సిన స్టాంపులు నాణ్యత లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.